క్లుప్తంగా

స్పౌజ్ పింఛన్లకు దరఖాస్తు చేసుకోవాలి

మొవ్వ: మండలంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు 2023వ సంవత్సరం డిసెంబర్ ఒకటి నుంచి పొందుతూ 2024 సంవత్సరం అక్టోబర్ 31 వరకు తీసుకొంటూ చనిపోయిన వారి భార్యలకు స్పౌజ్ పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని ఎంపీడీవో జె.విమాదేవి తెలిపారు. ఈ విధమైన పింఛన్లు ఆన్‌లైన్ చేసే ప్రొవిజన్ ప్రభుత్వం కల్పించిందని పేర్కొన్నారు. ప్రస్తుతం స్పౌజ్ పెన్షన్స్ ఏ విధంగా అప్రూవ్ చేస్తున్నారో ఈ పెన్షన్స్ కూడా అలానే చేయాలన్నారు. పెన్షన్ పొందుతూ మరణించిన వారి భార్యలకు మాత్రమే చేసుకోవడానికి అర్హులని స్పష్టం చేశారు. పింఛను రాకుండా చనిపోయిన భర్త కుటుంబానికి కొత్తగా వితంతువు పింఛను అప్లై చేసుకోవడానికి అవకాశం లేదని వెల్లడించారు.

ఇంగ్లీష్ నైపుణ్యం ఉంటే ఉద్యోగాలు



గుడివాడ టౌన్: స్పోకెన్ ఇంగ్లీష్ అభివృద్ధి చేసుకుంటే ఉపాధి గ్యారెంటీ అని ఏఎన్నార్ కళాశాల ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్ అన్నారు. కళాశాలలో అంతర్జాతీయ ఇంగ్లీష్ భాషా దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తమ విద్యార్థులు డిగ్రీతో పాటు స్పోకెన్ ఇంగ్లీష్‌లో నైపుణ్యం పెంపొందించుకుంటున్నారని చెప్పారు. కరస్పాండెంట్ కేఏస్ అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ బీఎస్ఎస్ పద్మజ, ఇంగ్లీష్ అధ్యాపకులు ప్రకాశ్, సుశీల పాల్గొన్నారు.

చెరువు పనుల పరిశీలన

మండవల్లి: మండలంలోని కానుకొల్లు మంచి నీటి చెరువును, తడిచెత్త, పొడిచెత్త తోలే రిక్షాల మరమ్మతుల పనులను ఈఓపీఆర్డీ సీహెచ్ శేఖర్, సర్పంచ్ నాగదాసి థామస్ గురువారం పరిశీలించారు. ఉపసర్పంచ్ కుందేటి నాగేశ్వరరావు, కార్యదర్శి కొండలు పాల్గొన్నారు.

నిరుపేదలకు అన్నదానం

గుడ్లవల్లేరు: లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు ఆధ్వర్యాన స్థానిక లయన్స్ సేవాభవన్‌లో గురువారం నిరుపేదలకు అన్నదానం చేపట్టారు. పసుమర్తి గాంధీ జ్ఞాపకార్థం కుమారుడు సత్యనారాయణ నిరుపేదలకు అన్నదానం చేశారన్నారు. లయన్స్ ప్రతినిధులు పెరుమాళ్ళు, నవాబు పాల్గొన్నారు.

27 నుంచి శిక్షణ తరగతులు

గుడివాడ టౌన్: ప్రజాహిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం గుడివాడ ఆధ్వర్యంలో చిన్నారులకు వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక గౌరీశంకరపురం లోని బ్రహ్మకుమారి సమాజంలో ఈ నెల 27వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయన్నారు. 6 నుంచి 16 సంవత్సరాల బాలలకు శిక్షణ ఉంటుందన్నారు.

హెచ్ఎం సాయిలక్ష్మి మృతి

ముదినేపల్లి రూరల్: మండలంలోని అల్లూరు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సాయిలక్ష్మి గురువారం మృతి చెందారు. అనారోగ్య కారణాలతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సాయిలక్ష్మి మృతికి మండలంలోని పలువురు ఉపాధ్యాయులు సంతాపం తెలిపారు. ముదినేపల్లిలోని సాయిలక్ష్మి నివాసానికి చేరుకుని ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

ఉగ్రదాడులపై నిరసన

ముదినేపల్లి రూరల్: ఉగ్రవాదులు జరిపిన దాడులకు నిరసనగా స్థానిక స్వామ్ ఐటీఐ కళాశాల విద్యార్థులు గురువారం నల్లబ్యాడ్జీలతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ప్రిన్సిపాల్ కూనపురెడ్డి సత్యనారాయణ ఆధ్వర్యంలో మౌనం పాటించి మృతుల కుటుంబాలకు సానుభూతి తెలియజేశారు. ఇలాంటి దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలని కోరారు. వైస్ ప్రిన్సిపాల్ కె.హరిత, అధ్యాపకులు వోలేటి మణిభీమరాజు, బి.కృష్ణమోహన్, వీఎస్ విజయదుర్గ, జీఎస్‌వీ శివ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



కైకలూరు: ప్రజలతో స్నేహపూర్వకంగా మెలుగుతూ పోలీసు విధులు నిర్వహించాలని ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్ అన్నారు. కైకలూరు టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ఎస్పీ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో సామాజిక బాధ్యతగా ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. దీనిని ఆదర్శంగా తీసుకుని ఇతర స్టేషన్లలో సిబ్బంది చలివేంద్రం ఏర్పాట్లుకు కృషి చేయాలని కోరారు. అనంతరం రూరల్ పోలీసుస్టేషన్‌ను వార్షిక తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. రికార్డులు తనిఖీ చేసి సిబ్బందికి తగిన సూచనలు ఇవ్వడంతో పాటు నేరాల సంఖ్య తగ్గుదలపై సిబ్బందిని అభినందించారు.

ఉపాధి కూలీలకు వసతులు కరువు

- పని ప్రదేశాల్లో అవస్థలు పడుతున్న వైనం
- పట్టించుకోని అధికారులు
- మండుటెండల్లో విలవిల్లాడుతున్న గ్రామీణ ఉపాధి కూలీలు



ఫొటో అప్ లోడ్ కోసం వేచి చూస్తున్న ఉపాధి కూలీలు

మొవ్వ: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చేస్తున్న కూలీలకు పని ప్రదేశాల్లో వసతులు కరువై నానా అవస్థలు పడుతున్నారు. మండుటెండల్లో కూలీలు పడుతున్న కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. మొవ్వ మండలంలోని 21 గ్రామాల్లో ఉపాధి హామీ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. పని ప్రదేశాల్లో ఉంచాల్సిన కనీస వసతులైన తాగునీరు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్, టెంటులు ఎక్కడా ఏర్పాటుచేయలేదు. మంచినీళ్లు లేకపోవడంతో కూలీలు దాహార్తితో అలమటిస్తున్నారు. నిబంధనల ప్రకారం వేసవిలో కూలీలు పనిచేసే ప్రదేశంలో కల్పించాల్సిన సదుపాయాల గురించి అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలొస్తున్నాయి. ఫీల్డ్ అసిస్టెంట్‌లు యాప్‌లల్లో ఫొటోస్ అప్ లోడ్ చేయించుకోవటానికి సైతం గంటల తరబడి చెట్టు, పుట్టలు, రోడ్లులపై పడిగాపులు కాస్తున్న కూలీల గుంపులు కోకొల్లలుగా గ్రామాల్లో దర్శనమిస్తున్నాయి. పని ప్రదేశాల్లో పాలుగు, పార దెబ్బలతో కొందరు కూలీలు గాయాల పాలైన ఘటనలు పదుల సంఖ్యలో ఉన్నాయి. కనీసం ఎటువంటి ప్రథమ చికిత్స కూడా అందక నరకయాతన పడుతున్నారు. మొవ్వ మండలంలో సుమారు 7వేల మంది కూలీలు పనులకు హాజరవుతుంటే వీరికి గత మూడు వారాలుగా వేతనాలు జమ కావటం లేదు. ఫీల్డ్ అసిస్టెంట్‌లకు సైతం గత నెల జీతాలు సైతం నేటికీ ఖాతాల్లో జమకాకపోవటం విశేషం. ఉపాధి హామీ పథకంలో 200 రోజులు పని దినాలు కల్పించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనాన్ని పెంచాలని, ప్రభుత్వమే నగదు చెల్లించి ప్రతి ఉపాధి హామీ కార్మికుడికి తప్పనిసరిగా ఇన్సూరెన్స్ చేయించాలని ఉపాధి కూలీలు కోరుకుంటున్నారు.

పలుగు పడింది



ప్రభుత్వాలు కూలీలకు మౌలిక సదుపాయాలు కల్పించడం లేదు. మొవ్వ మండలం పెదసనగల్లు గ్రామంలో ఉపాధి పని చేస్తుండగా పలుగు పడి వేళ్లకి గాయమైంది. కనీసం ప్రథమ చికిత్స చేసిన వారులేరు. ప్రైవేటు హాస్పటల్‌లో వైద్యం చేయించుకుంటే వేల రూపాయిల ఖర్చయింది.

– పామర్తి శ్రీ లక్ష్మి, పెదసనగల్లు గ్రామానికి చెందిన ఉపాధి కూలీ

సమస్యలు పరిష్కరించాలి



కనీస సదుపాయాలు లేక ఉపాధి కూలీలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే అన్ని గ్రామాలకు మెడికల్ కిట్, టెంట్ సౌకర్యం, మంచినీటి సదుపాయం కల్పించాలి. పని ప్రదేశాల వద్ద పర్యటన చేసి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారం కోసం కృషి చేయాలి.

– శీలం నారాయణరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు

చోరీల నివారణపై ప్రజలకు అవగాహన



టిడ్కో సముదాయం వద్ద ఆటో ద్వారా ప్రచారం చేస్తున్న తాలూకా పోలీసులు

గుడివాడరూరల్: చోరీలపై మండలంలోని ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని గుడివాడ తాలూకా ఎస్ఐ ఎన్.చంటిబాబు సూచించారు. మండలంలోని టిడ్కో సముదాయం వద్ద, పలు గ్రామాల్లో గుడివాడ తాలూకా పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో గురువారం ఆటో ప్రచారం ద్వారా చోరీల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ చంటిబాబు మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లోని ప్రజలు వేసవి దృష్ట్యా దొంగతనాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. ఎందుకంటే పిల్లలకు స్కూల్స్ సెలవులు ఇవ్వడం వల్ల విహారయాత్రలు, బంధువుల ఇళ్లకు వెళ్లే వారు పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. ఇళ్లు, అపార్టుమెంట్‌ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. బంగారు, నగదు ఇళ్లల్లో ఉంచుకోకుండా బ్యాంకు లాకర్లలో భద్రపర్చుకోవాలని చెప్పారు. వేసవి దృష్ట్యా పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కాల్వలు, నీటి గుంటల వద్దకు వెళ్లకుండా చర్యలు తీసుకుని జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు.

రైల్వేగేటు వెడల్పు చేయాలని వినతి



వినతిపత్రం సమర్పిస్తున్న భద్రతాదళం సభ్యులు

గుడివాడ టౌన్: పట్టణంలోని కేటీఆర్ కళాశాల రోడ్డులో గల రైల్వే గేటు వెడల్పు చేయాలని భవిష్యత్ భద్రతా దళం సభ్యులు కోరారు. ఈ మేరకు రైల్వే సీనియర్ డివిజినల్ ఇంజినీర్ కె. శ్రీధర్‌కు గురువారం వినతిపత్రం సమర్పించారు. రైల్వే ఫ్లై ఓవర్ నిర్మాణం కొనసాగుతున్న నేపథ్యంలో గేట్ నెంబర్ 52 సుమారు ఆరు నెలలు మూసివేయాల్సి వస్తుందని.. దీంతో ట్రాఫిక్ మూడింతలు పెరుగుతుందన్నారు. కేటీఆర్ కళాశాల రోడ్‌లోని గేట్ నెంబర్ 51 ఇప్పటికే ఇరుకుగా ఉన్నందున ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. గేటు వెడల్పు చేయాలని కోరుతూ గత 10 రోజులుగా వేలాది సంతకాలు సేకరణ జరిగిందన్నారు. సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించగా గేటును 15 మీటర్ల వరకు విస్తరించేందుకు ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చినట్లు భద్రతాదళం సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భవిష్యత్ భద్రతాదళం వ్యవస్థాపకుడు వైవీ మురళీకృష్ణ, పి. రాజశేఖర్, మహ్మద్ తెహర్ భాషా, జి. పూర్ణచంద్రరావు, ఎస్. దుర్గారావు, షేక్ సుభాని పాల్గొన్నారు.

‘పది’ విద్యార్థులకు అభినందనల వెల్లువ



యశ్వంత్, 588 మార్కులు



శారదావీణతో హెచ్చెం పద్మావతి



విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే కామినేని



రూ.10వేల చెక్కును మండల టాపర్ సంజనకు అందిస్తున్న ప్రభాకరరావు



అమీరున్నీసాను సత్కరిస్తున్న పాఠశాల యాజమాన్యం

పమిడిముక్కల: పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో మండలంలోని మేడూరు శివారు జువ్వలపాలెంకు చెందిన పామర్తి వెంకట సాయి యశ్వంత్ మండల స్థాయిలో టాపర్‌గా నిలిచాడు. కూచిపూడి హోలిస్పిరిట్ స్కూల్లో చదివిన యశ్వంత్ 600 మార్కులకు గాను 588 మార్కులు సాధించాడు. తెలుగులో 99, ఇంగ్లీషులో 99, హిందీలో 93, మ్యాథ్సలో 98, సైన్స్‌లో 99, సోషల్‌లో 100 మార్కులు సాధించాడు. యశ్వంత్‌ను జువ్వలపాలెం గ్రామస్తులు, ఎంపీపీ కాసాని వేద సుప్రజ, మేడూరు సర్పంచ్ గొర్కెపూడి స్వర్ణలత అభినందించారు.

కైకలూరు: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అభినందించారు. కైకలూరు ఆటపాక చైతన్య పాఠశాల విద్యార్థులు పరీక్షల్లో ప్రతిభ చూపారు. నియోజకవర్గంలోనే అత్యధిక ఉత్తీర్ణత సాధించడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు ఎమ్మెల్యేను నివాసంలో గురువారం కలిశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్వీట్లు పంచి అభినందనలు తెలిపి విద్యలో రానిస్తూ ఉజ్వల భవిష్యత్ సాధించాలని సూచించారు. ఉత్తమ ఫలితాలతో నియోజకవర్గానికి గుర్తింపు తేవాలని కోరారు.

గుడ్లవల్లేరు: పది ఫలితాల్లో మండల టాపర్‌గా నిలిచిన శింగంశెట్టి సంజనకు అభినందనలు వెల్లువెత్తాయి. గురువారం ఆమెను గ్రామస్తులు అభినందించారు. ఈ సభలో బీజేపీ మండల అధ్యక్షుడు శేషం నగేష్ రూ.10వేలను సంజనకు ఆర్థిక సాయం చేశారు. ఈ చెక్కును వడ్లమన్నాడు రైతు క్లబ్ అధ్యక్షుడు పెన్నేరు ప్రభాకరరావు చేతుల మీదుగా అందజేశారు. ఉత్తీర్ణులైన విద్యార్థులను, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రసాద్, పాఠశాల ఉపాధ్యాయులందరినీ ఈ సందర్భంగా అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ గుడిశేవ రమేష్, ఉప సర్పంచి గరికిపాటి రాంబాబు, గ్రామ ప్రముఖులు పెన్నేరు రమేష్ బాబు, తోట చిన్నారి, నత్తా ప్రసాద్, రామాంజనేయులు పాల్గొన్నారు.

మండల టాపర్ శారదావీణకు అభినందనలు

గుడివాడ టౌన్: పదో తరగతి పరీక్షల్లో మాంటిస్సోరి ఇంగ్లీష్ మీడియం విద్యార్థిని చామర్తి శారదావీణ గుడివాడ, రూరల్ మండలంలో టాపర్‌గా నిలిచిందని హెచ్ఎం జి. పద్మావతి తెలిపారు. గురువారం శారదా వీణను అభినందించారు. ఈ పరీక్షల్లో శారదావీణ 585/600 మార్కులు సాధించి మండలంలో టాపర్‌గా నిలిచిందని తెలిపారు. శారదావీణను పాఠశాల యాజమాన్యం అభినందించింది.

గుడివాడ టౌన్: పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన శ్రీచైతన్య విద్యార్థిని షేక్ అమీరున్నీసాను పాఠశాల యాజమాన్యం గురువారం సత్కరించింది. అమీరున్నీసా 594/600 మార్కులు సాధించి పాఠశాలలో ప్రథమస్థానంలో నిలిచింది. తమ పాఠశాలలో 580 మార్కులు పైబడి 8 మంది ఉత్తీర్ణత సాధించడం మా ప్రత్యేకత అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయ్ భాస్కర్, శ్రీచైతన్య జోనల్ కో–ఆర్డినేటర్ అశోక్, ఆర్ఐ ధీరేంద్ర, ఏజీఎం మురళీకృష్ణ, డీన్ త్రినాథ్ బాబు, కోటేశ్వరరావు అభినందించారు.

ఉగ్ర దాడికి నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ



పామర్రు: ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ పామర్రులోని స్థానిక నాలుగురోడ్ల కూడలి వద్ద గురువారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పామర్రు వాసవీ క్లబ్, ఆర్యవైశ్య సంఘ సభ్యులు ఆధ్వర్యంలో ర్యాలీ చేశారు. సంఘ నేతలు ఘంటసాల త్రివిక్రమ సాయిరాం, కంచర్ల జనార్దనరావు, బొగ్గరపు సాయిబాబు, మండా కమలాకరనాథ్, భాస్కరరావు, ఆదినారాయణ, శివయ్య, ఆరేపల్లి శ్రీనివాసరావు, తాళ్లూరి నరేష్, బొమ్మిశెట్టి చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు. జనసేన పార్టీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ చేశారు. కొవొత్తుల ర్యాలీతో సంతాపాన్ని తెలియజేశామని నియోజకవర్గ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్ పేర్కొన్నారు. కార్యక్రమంలో నేతలు కాకి ఝాన్సీ, గుంప గంగాధర్‌రావు, కె. సుబ్బారావు, ఐదు మండలాల పార్టీ నేతలు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల్లో గుడ్లవల్లేరు జట్టు విజేత



గుడ్లవల్లేరు: జిల్లా పంచాయతీ రాజ్ ఉద్యోగులకు గుడివాడ ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు గురువారంతో ముగిశాయి. ఈ ఫైనల్ పోటీల్లో నాగాయలంక ఉద్యోగుల టీమ్‌పై గుడ్లవల్లేరు మండలానికి చెందిన పంచాయతీరాజ్ ఉద్యోగుల జట్టు విజయం సాధించింది. గ్రామ కార్యదర్శులు ఎలీషారావు, చాపరాల రాజేష్, సచివాలయ ఉద్యోగులను ఎంపీడీఓ టి.విజయసారథి అభినందించారు.

జాతీయ పోటీలకు గుడివాడ విద్యార్థిని



గుడివాడ టౌన్: జాతీయ ఖో–ఖో పోటీలకు గుడివాడ ఎస్‌పీఎస్ మున్సిపల్ హైస్కూల్ ఇంటర్ విద్యార్థిని డి. కృష్ణవేణి ఎంపికై నట్లు ప్రధానోపాధ్యాయురాలు టి. శ్రీనివాసరావు గురువారం తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జనవరి 22 నుంచి 25 వరకు చిత్తూరులో జరిగిన రాష్ట్రస్థాయి అండర్–19 ఖో–ఖో పోటీల్లో కృష్ణవేణి ప్రతిభను ప్రదర్శించిందని చెప్పారు. ఈ నెల 30వ తేదీ నుంచి మే 4వ తేదీ వరకు ఢిల్లీలో జరిగే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ పోటీల్లో కృష్ణవేణి ఆడతారని పేర్కొన్నారు. కృష్ణవేణిని కృష్ణా జిల్లా ఖో–ఖో సంఘం చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, కార్యదర్శి ఎం.సత్యప్రసాద్, పీఈటీ పడకా ప్రసాద్ తదితరులు అభినందించారు.

నూరు శాతం రుణాల వసూళ్లు

కైకలూరు: తాడినాడ సొసైటీ 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నూరు శాతం రుణాలు వసూళ్లు చేసినట్లు సీఈవో వీవీ సుబ్బరాజు తెలిపారు. సంఘంలో 266 మంది సభ్యులు రూ.8,32,75,000 రుణాలు వడ్డీతో సహా పూర్తిగా వసూళ్లు చేసినట్లు చెప్పారు. 25 సంవత్సరాలుగా ఇదేవిధంగా నూరుశాతం రుణాలు వసూలు చేస్తున్నట్లు తెలిపారు.

కోటిరెడ్డి లేని లోటు తీర్చలేనిది



కోటిరెడ్డి కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న మాజీ మంత్రి పేర్ని నాని, మాజీ ఎమ్మెల్యే కైలే

పామర్రు: వైఎస్సార్ సీపీ స్థాపించిన నాటి నుంచి అభ్యున్నతికి ఎనలేని కృషి చేసిన వ్యక్తి ఏరువ కోటిరెడ్డి అని వైఎస్సార్ సీపీ కృష్ణా జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) తెలిపారు. పామర్రు గ్రామానికి చెందిన పార్టీ సీనియర్ నాయకులు ఏరువ కోటిరెడ్డి బుధవారం మృతి చెందగా ఆయన భౌతిక కాయానికి గురువారం మాజీ మంత్రి, స్థానిక మాజీ ఎమ్మెల్యేతో కలిసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి మంచి అనుచరుడుగా పేరు పొందిన వ్యక్తి కోటిరెడ్డి అని తెలిపారు. వైఎస్సార్ సీపీలో ఉంటూ జగన్ నిర్వహించిన ఓదార్పు యాత్రలో కృష్ణా జిల్లాలో కీలక వ్యక్తిగా వ్యవహరించారని చెప్పారు. కోటిరెడ్డి లేని లోటు పార్టీకి తీర్చలేనిదని పేర్కొన్నారు. భౌతికకాయాన్ని కొద్ది దూరం స్థానిక మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్‌తో కలిసి మోసి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు తాడిశెట్టి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ బాల వెంకటేశ్వరరెడ్డి, పార్టీనాయకులు బొమ్మారెడ్డి అప్పిరెడ్డి, బొమ్మారెడ్డి కృష్ణారెడ్డి, ఆరుమళ్ల శ్రీనాధ్‌రెడ్డి, కాకర్ల వెంకటేశ్వరరావు, పెయ్యలరాజు, నందిపాటి సురేష్‌రెడ్డి, ఫణీంద్రరెడ్డి, ఎన్‌సింహాచలం, మున్నంగి సత్యనారాయణరెడ్డి, కుందేటి రాణి తదితర పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పామర్రు ఎమ్మెల్యే పరామర్శ

ఏరువ కోటిరెడ్డి మృత దేహాన్ని స్థానిక ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

చెరువు సమస్యను వెంటనే పరిష్కరించాలి



మోటూరులో విలేకర్లతో మాట్లాడుతున్న ఆర్సీపీ రెడ్డి

గుడివాడరూరల్: తాగునీటి చెరువు తవ్వకుండా నీరు పెడితే గ్రామస్తులతో కలసి ఆందోళన చేస్తామని సీపీఎం జిల్లా నాయకుడు ఆర్సీపీ రెడ్డి అన్నారు. మండలంలోని మోటూరు గ్రామంలో తాగునీటి చెరువు సమస్యను గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకురాగా గురువారం పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోటూరు గ్రామ నడిబొడ్డులో 13 ఎకరాల మంచినీటి చెరువు ఉందని తెలిపారు. చెరువు తవ్వి తాగునీరు అందించాలని గ్రామస్తులు అడుగుతున్నా అటు అధికారులు గానీ ఇటు పాలకులు గానీ పట్టించుకోవడం లేదన్నారు. కానీ పంచాయతీ పాలకవర్గాలు ఎప్పటికప్పుడు చెరువులో తూటికాడ తొలగించి నీరు పెట్టడం వల్ల నీరు కలుషితమై దుర్వాసన వచ్చి తాగేందుకు పనికి రాకుండా పోతున్నాయన్నారు. గ్రామస్తులు అనేకసార్లు చెరువు తవ్వించాలని అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఇటీవల గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులకు చెరువు తవ్వేందుకు అనుమతులు ఇవ్వాలని గ్రామస్తులు కోరగా వాళ్లు చెరువును గత కొన్ని నెలలుగా ఎండ గట్టారని, కానీ ప్రస్తుత ఏఈ మంచి నీళ్లు వచ్చాయని వెంటనే చెరువులు నింపుకోవాలని చెప్పడం దారుణమన్నారు. గ్రామస్తులు మాత్రం చెరువును తవ్వండి నీళ్లు లేకపోయినా వేరే మార్గం చూసుకుంటామని చెప్పినా అధికారులు పట్టించుకోకుండా చెరువు నింపేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చారని, ఇటీవల గ్రామానికి వచ్చి చెరువును పరిశీలించారని కానీ చర్యలు తీసుకోలేదన్నారు. చెరువు తవ్వకానికి గ్రామస్తులే చందాలు వేసుకుని తవ్విస్తామని ముందుకు వస్తున్నా పట్టించుకోకపోవడం సరికాదన్నారు. చెరువు నింపేందుకు ప్రయత్నం చేస్తే గ్రామస్తులతో కలసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి తాగునీటి చెరువు సమస్యను పరిష్కరించి గ్రామస్తులకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

ఘనంగా అంతర్జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం



మండల పరిషత్ కార్యాలయంలో పంచాయితీరాజ్ దినోత్సవంలో పాల్గొన్న ఏఓ రామకృష్ణ



పంచాయతీరాజ్ దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్

పమిడిముక్కల: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం అంతర్జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహాత్మగాంధీ, అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొడమంచిలి మహేష్, ఎంపీటీసీ గుర్విందపల్లి వంశీ, ఏఓ గోలి రామకృష్ణ, ఏపీఎం వెంకటేశ్వర్లు, పీఆర్ ఏఈ పృధ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు: పంచాయతీరాజ్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ టి.విజయసారథి గురువారం నిర్వహించిన సమావేశంలో మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల కార్యదర్శులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కైకలూరులో పంచాయతీరాజ్ దినోత్సవం

కైకలూరు: స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి పంచాయతీలు పట్టుకొమ్మలన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థ కారణంగానే గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి పీఎస్‌పీ ఆనందభూషణ్, వార్డు సభ్యురాలు గుడిపాటి విజయశేషు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీరంగం, వీరాబత్తిన సుధా, సిబ్బంది పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు సంతాపం



సంతాపం తెలుపుతున్న ఉద్యోగులు

గుడ్లవల్లేరు: జమ్మూ – కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో రెండు రోజుల క్రితం జరిగిన దారుణమైన ఉగ్రవాద దాడిపై తీవ్ర విచారం వ్యక్తం చేస్తునట్లు గుడ్లవల్లేరు పాల శీతలీకరణ కేంద్రం మేనేజర్ తోట సత్యనారాయణ తెలిపారు. ఈ విషయమై గురువారం గుడ్లవల్లేరులో ఉద్యోగులు, సిబ్బంది మృతుల కుటుంబాలకు సంతాపం వ్యక్తం చేశారు. ఈ విషాద సంఘటనలో 28 మంది అమాయక పౌరులు ఉగ్రవాదుల చేతిలో మరణించారని తెలిపారు. ఇటువంటి క్రూరమైన, అమానవీయ చర్యలు మానవాళిపై మచ్చ, మన దేశ సమగ్రత, ఐక్యతకు సవాలు అని అన్నారు. దీనికి ప్రతిస్పందనగా, బాధితులకు సంఘీభావం తెలియజేస్తూ... ఈ అర్థరహిత హింసను ఖండించడానికి తమ కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు ఆదేశాల మేరకు ఉద్యోగులమంతా శాంతియుత సమావేశాన్ని నిర్వహించి అమరుల కుటుంబాలకు సంఘీబావం తెలియజేస్తున్నట్లు చెప్పారు.

ప్రారంభమైన ఎంపీఏ ద్వితీయ సంవత్సర ప్రాక్టికల్ పరీక్షలు



ప్రాక్టికల్ పరీక్షకు హాజరైన ఎంపీఏ నాట్య విద్యార్థిని

కూచిపూడి(మొవ్వ): నాట్య క్షేత్రం కూచిపూడిలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పరిధిలోని శ్రీ సిద్ధేంద్రయోగి కూచిపూడి కళా పీఠంలో ఎంపీఏ (మాస్టర్ ఆఫ్ పర్ఫార్మింగ్ ఆర్ట్స్) ద్వితీయ సంవత్సరం నాలుగో సెమిస్టర్ ప్రాక్టికల్ పరీక్షలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. తొలి రోజు ఉదయం కలాపములు అంశంపై, సాయంత్రం యక్షగానం అంశంపై ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించారు. పరీక్షకులుగా నాట్యాచార్యులు హరి రామమూర్తి, పసుమర్తి రత్తయ్య శర్మ వ్యవహరించారు. ఈ పరీక్షలకు చీఫ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ చింతా రవి బాలకృష్ణ, నట్టువాంగంపై డాక్టర్ ఏలేశ్వరపు నివాసులు, గాత్రంపై వేదాంతం వెంకట దుర్గా భవాని, మృదంగంపై పసుమర్తి హరనాథశాస్త్రి సహకరించారు.

ఎంపీడీవోగా మల్లీశ్వరి బాధ్యతలు స్వీకరణ

పెదపారుపూడి: ఎంపీడీవోగా పి.మల్లీశ్వరి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత ఎంపీడీవో విధులు నిర్వహిస్తున్న టి. సీతామహాలక్ష్మీ విజయవాడ డెప్యూటీ జోనల్ మేనేజర్‌గా బదిలీపై వెళ్లారు. మల్లీశ్వరి నందివాడ ఎంపీడీవోగా పని చేస్తూ పెదపారుపూడి ఎంపీడీవో అదనపు బాధ్యతలు చేపట్టారు. గతంలో ఎంపీడీవో పెదపారుపూడి ఎంపీడీవోగా పని చేశారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

మండవల్లి: పెరికెగూడెంలో సర్పంచ్ పెరుమాళ్ళ పద్మ పర్యవేక్షణలో ప్రకృతి వ్యవసాయ మండల ఇన్‌చార్జి నాగవిజయ ఆధ్వర్యంలో పీఎండీఎస్, ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. యూనిట్ ఇన్‌చార్జి గౌతమ్‌కుమార్ మాట్లాడుతూ మరింత ముందుకు వెళ్లడానికి ప్రతి రైతు అవగాహన పెంచుకోవాలని సూచించారు. వీఏఏ గోపాల్, సర్పంచ్ పద్మ, వైస్ సర్పంచ్ నాగబాబు, నీటి సంఘం అధ్యక్షుడు ఎలికే రాంబాబు, ఉత్తమ రైతులు పెరుమాళ్ళ నాగరాజు, వరప్రసాద్, పాము వెంకయ్య, ఉడతా మద్దిరామయ్యలను సన్మానించారు. ఐసీఆర్పీలు నాగరాణి, నళిని, రామారావు, జగన్, వీరాంజనేయులు, దుర్గారావు, రైతులు సత్యనారాయణరెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.